క్లుప్తంగా

రేపు సర్వసభ్య సమావేశం

పెద్దమండ్యం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సాధారణ సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సి వెంకటరమణయ్య సోమవారం తెలిపారు. ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని కోరారు. అలాగే మండలంలోని ఆయాశాఖల అధికారులు అభివృద్ధి పనుల వివరాలతో తప్పని సరిగా సర్వసభ్య సమావేశానికి రావాలన్నారు. ఈ మేరకు ప్రజాప్రతినిధులకు, ఆయాశాఖల అధికారులకు సమచారం అందించినట్లు చెప్పారు.

భగవద్గీతపై ప్రచారం



భగవద్గీత ప్రతులను అందజేస్తున్న త్రైత సిద్ధాంత బోధనా సమితి సభ్యులు

నిమ్మనపల్లె : మండలంలోని అగ్రహారం పంచాయతీ చెరువు ముందర పల్లె, చింతపర్తివారి పల్లె, పూలవాండ్ల పల్లె, రెడ్డివారిపల్లె, బండమీదపల్లె అగ్రహారం గ్రామాల్లో సోమవారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో భగవద్గీత పై ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానికులకు భగవద్గీత ప్రతులను కనీస ధరకు అందజేశారు. హిందువులందరు భగవద్గీతను తప్పనిసరిగా చదవాలని సూచించారు. భగవద్గీతతో పాటు అనుబంధ పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో కంభం, బంగారుపాలెం, పలమనేరు, కుప్పం కమిటీల సభ్యులు నర్‌రెడ్డి శ్రీనివాసరెడ్డి, తిరుపతయ్య, భాస్కర్, కిరణ్, జ్యోతి, జీవరత్న, కృష్ణ, ఇందిర తదితరులు పాల్గొన్నారు.


29 నుంచి వేరుశనగ విత్తన కాయల పంపిణీ

– ఏడీఏ దీక్షాకుమారి



మదనపల్లె : ఖరీఫ్–2024 సీజన్‌కు సంబంధించి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై పంపిణీ చేయనున్న వేరుశనగ విత్తనకాయలు బుధవారం నుంచి పంపిణీ చేయనున్నట్లు ఏడీఏ దీక్షాకుమారి తెలిపారు. సోమవారం స్థానిక వ్యవసాయశాఖ ఏడీఏ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ... మదనపల్లె వ్యవసాయశాఖ డివిజన్ పరిధిలోని 8 మండలాలకు సంబంధించి 25,294 క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలు పంపిణీకి సిద్ధం చేశామన్నారు. దాదాపు 80 శాతానికి పైగా కాయలు ఆర్‌బీకేలకు చేరుకున్నాయన్నారు. వేరుశనగ విత్తనకాయలు కావాల్సిన రైతులు తమ ఆధార్, పట్టాదారుపాసు పుస్తకం జిరాక్స్‌లను తీసుకుని, సమీపంలోని ఆర్‌బీకేకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకోని వారికి విత్తన కాయలు ఇవ్వడం జరగదని, మంగళవారం రిజిస్ట్రేషన్‌కు చివరిగడువుగా పేర్కొన్నారు. అలాగే రైతులకు 50 శాతం సబ్సిడీతో పంపిణీ చేసేందుకు 1,609 క్వింటాళ్ల పచ్చిరొట్ట ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. భూసారాన్ని పెంచడంలో ఇవి ఎంతగానో ఉపయోగపడుతాయని, కావాల్సిన రైతులు ఎరువులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పట్టుదల ఉంటే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు



ధృవపత్రాలు అందజేస్తున్న సీఐ శేఖర్

మదనపల్లె సిటీ: విద్యార్థులు పట్టుదల ఉంటే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చునని మదనపల్లె తాలూకా సీఐ శేఖర్ అన్నారు. సోమవారం స్థానిక నిమ్మనపల్లె రోడ్డులోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కాలేజీలో జాబ్ అచీవర్స్ డే నిర్వహించారు. సీ.ఐ మాట్లడుతూ ప్రతి విద్యార్థి అందివచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చదువులో రాణిస్తే మంచి ఉద్యోగాలు వస్తాయన్నారు. చదువును నిర్లక్ష్యం చూపవద్దని తెలిపారు. కాలేజీ ప్రిన్సిపాల్ ఓబులేసు మాట్లాడుతూ 2023–24 సంవత్సరంలో 10 కంపెనీలు సందర్శించాయన్నారు. 50 శాతం మంది విద్యార్థులు ప్రాంగణ నియామకాలకు ఎంపికైనట్లు తెలిపారు. ప్రాంగణ నియామకాలలో ఎంపికైన విద్యార్థులకు సీఐ ధృవపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు సావిత్రి, మాణిక్యం, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానం లాంటిదే

రాయచోటి టౌన్ : రక్తదానం చేయడం అంటే ప్రాణదానం చేయడం లాంటిదేనని హెల్పింగ్ హ్యాండ్స్ బ్లడ్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ మైనుద్దీన్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో రాయచోటికి చెందిన సుమా అనే గర్భిణీ కాన్పు కోసం వెళ్లింది. ఆమెకు కాన్పు చేయడానికి (ఏ+) రక్తం కావాలని వైద్యులు సూచించారు. బాధితులు హెల్పింగ్ హ్యాండ్స్ వారిని సంప్రదించడంతో వారు వెంటనే స్పందించి ఆదిల్ అనే యువకుడితో రక్తం చేయించారు. తరువాత ఆమెకు సిజేరియన్ ద్వారా కాన్పు చేశారు. కార్యక్రమంలో పమీర్, బాబుల్లా, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అక్షర సేవకులు.. అవిశ్రాంత యోధులు

- రిటైరయ్యాక కూడా బోధిస్తున్న టీచర్లు
- చిన్నారులను మంచి పౌరులుగా తీర్చిదిద్దుతున్న వైనం
- ప్రతి వేసవిలో 100 మందికి విద్యార్థులకు శిక్షణ

మదనపల్లె సిటీ: బడులకు సెలవులు ఇచ్చేశారు. స్నేహితులతో కాలక్షేపం చేద్దామంటే ఊళ్లకు, విహారయాత్రలకు చెక్కేశారు. పోనీ ఇరుగు పొరుగు పిల్లలతో ఆరుబయట ఆడుకుందామంటే ఎండలు మాడు పగలగొడుతున్నాయి. దాంతో ఏమీ తోచక సెలవు రోజులను నిస్సారంగా గడిపేస్తున్న పిల్లలకు ఆ దిగులు లేకుండా చేస్తున్నారు విశ్రాంత ఉద్యోగులు. ఉద్యోగ విరమణ చేసినా బోధనకు విశ్రాంతి లేదని చాటి చెబుతున్నారు. గత ఐదేళ్లుగా మదనపల్లె పట్టణం శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో ఉచితంగా పాఠాలు బోధిస్తున్నారు. దీనిపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

పిల్లలు హాయిగా నవ్వాలి. నవ్వుతూ ఆడుకోవాలి. ఆడుతూ నేర్చుకోవాలి. నేర్చుకుంటూ పైకి ఎదగాలి. ఇది శాఖ గ్రంథాలయంలోని వేసవి శిక్షణ శిబిరం ఉద్దేశం. ఇక్కడ ఏమి నేర్చుకున్నా, సంగీత సాధన చేసినా, నృత్యం చేసిన దాని ఉద్దేశం సెలవులను సరైన రీతిలో ఉపయోగించుకోవడమే. ఇప్పటికే వందకుపైగా పిల్లలు శిబిరంలో చేరి తమకు ఇష్టమైన అంశాలను నేర్చుకుంటున్నారు. 70 ఏళ్లు దాటినా ఇంకా చురుగ్గా పని చేస్తున్నారు.

సంప్రదాయ విలువలు వివరిస్తూ..



నా పేరు టీ.ఎస్.ఎ.క్రిష్ణమూర్తి. మున్సిపాలిటీలో క్లర్కుగా పదవీ విరమణ పొందా. నేను స్వతహాగా రచయితను. నేటితరం విద్యార్థుల్లో సనాతన సంప్రదాయ విలువలపై అవగాహన లేదని గ్రహించా. అదేవిధంగా తెలుగు భాషా నైపుణ్యం కూడా కొరవడుతోంది. ఈ నేపథ్యంలో ఆరేళ్లుగా విద్యార్థులకు ఆయా అంశాలపై శిక్షణ ఇస్తున్నా. ప్రధానంగా కథలు చెప్పడం వల్ల వారిలో చదువుపై ఆసక్తి పెరుగుతుంది. ఇతరులకు సేవ చేస్తే ఎనలేని తృప్తి లభిస్తుందని గ్రహించా.

ఆంగ్లభాషపై తర్ఫీదు



నా పేరు బి.రెడ్డప్ప. గ్యారంపల్లె ఏపీఆర్‌జెసిలో ఇంగ్లీషు అధ్యాపకుడిగా పని చేసి పదవీ విరమణ పొందా. గత మూడు సంవత్సరాలు నుంచి శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులకు స్వచ్ఛందంగా వచ్చి విద్యార్థులకు ఆంగ్లభాష పరిజ్ఞానంపై తర్ఫీదు ఇస్తున్నా. విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపుతూ పోటీ ప్రపంచంలో ఆంగ్లభాష ప్రాధాన్యాన్ని వివరిస్తున్నా. ప్రభుత్వ పాఠశాల్లోని పేద విద్యార్థులు ఆంగ్లంలో సులువుగా మాట్లాడేలా చేస్తున్నా. గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సాధన చేస్తున్న యవత ఏం చదవాలి..ఎలా చదవాలి .. వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నా. పదవీ విరమణ పొందిన తర్వాత కాలాన్ని ఈ విధంగా సద్వినియోగం చేసుకుంటున్నా.

డ్రాయింగ్, తెలుగు నేర్పుతున్నా..



నా పేరు వీఎం నాగరాజు. ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేసి పదవీ విరమణ పొందా. గత ఐదు సంవత్సరాలుగా శాఖ గ్రంథాలయంలో డ్రాయింగ్, తెలుగుపై తర్ఫీదు ఇస్తున్నా. చిన్నారులకు బొమ్మలంటే ఇష్టం. బొమ్మలు ఎలా గీయాలి అనే విషయాలు తెలియజేస్తున్నా. వారిలో కళాత్మకను తీసుకువస్తున్నా. బొమ్మలు వేయడం వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత పెరుగుతుంది. తెలుగులో నీతి కథలు చెప్పడం వల్ల విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుంది.

ఆరోగ్యవంతమైన సమాజం కోసం



నా పేరు శకుంతలమ్మ. మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేసి పదవీ విరమణ పొందా. రోజు రోజుకు మారుతున్న సమాజంలో ఆహారం, గాలి, నీరు,కలుషితమవుతోంది. ఇటువంటి సమాజానికి యోగా చాలా అవసరం. దీని ద్వారా రోగనిరోధశక్తి పెంచుకోవచ్చు. దీని కోసం యోగా నేర్పిస్తున్నా. స్కౌట్స్,గైడ్స్ సేవలు వివరిస్తున్నా. సేవలు ఎలా చేయాలో తెలియజేస్తున్నా. దేశ భక్తితో పాటు సామాజిక సేవలు వివరిస్తున్నా.

ఎంతో తృప్తిగా ఉంది

విశ్రాంత ఉద్యోగులు వచ్చి వేసవి శిక్షణా శిబిరంలో ఉచితంగా తరగతులకు హాజరు కావడం ఎంతో తృప్తిగా ఉంది. ప్రతి ఏడాది తామే ముందుకు వచ్చి బోధించడం సంతోషం. పిల్లల్లో మార్పు తీసుకురావడం కోసం, వేసవి సెలవులు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవడం ఆనందంగా ఉంది.



– వసంతకుమారి, లైబ్రేరియన్, మదనపల్లె

రమణీయం.. పుష్పయాగం



శ్రీవారికి పుష్పయాగం నిర్వహిస్తున్న వేదపండితులు



పుష్పయాగం తిలకిస్తున్న భక్తులు

మదనపల్లె సిటీ: చామంతి, గన్నేరు, మొగలి, సంపంగి, జాజి, రోజా, తామర, మల్లె, వృక్షి, కనకాంబరాలతో పాటు బిల్వపత్రం, తులసి, పన్నీరు ఆకులతో శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామికి పుష్పయాగం నాయనానందకరంగా సాగింది. అశేష సంఖ్యలో భక్తులు పుష్పార్చన వీక్షించి తరించారు. మదనపల్లె పట్టణం దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో సోమవారం పుష్పయాగం అత్యంత వైభవంగా జరిగింది. వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిసిన మరుసటి రోజు పుష్పయాగం నిర్వహించడం అనవాయితీ. తెల్లవారుజామున ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీదేవి, భూదేవి సమేతంగా వెంకటరమణస్వామికి సర్వాంగసుందరంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు విశేషంగా అలంకరించి ఆలయంలోని ప్రత్యేక కళ్యాణ వేదికపైకి వేంచేపు చేశారు. అనంతరం వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ పరిమిళభరిత పుష్పాలు, విశేషపత్రాలతో స్వామి,అమ్మవార్లను అర్పించి, మహామంగళ హారతులు ఇచ్చారు. అశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయంలో అర్చక, పరిచారకులు, అధికార, అనధికారుల, భక్తుల కారణంగా తెలియక జరిగిన లోపాలకు ప్రాయశ్చిత్తంగా పత్రపుష్పయాగం నిర్వహిస్తారని ఆలయ ప్రధాన అర్చకులు గోవర్ధన్‌భట్టార్, వేదపండితులు లక్ష్మణ, బాలాజీ తెలిపారు. ఉత్సవాల్లో ఆలయ ఈఓ రమణ, మాజీ చైర్మన్ బింగి పాండు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గర్నిమిట్ట ఎల్లమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మ



ఆలయ ప్రదక్షిణ చేస్తున్న చాందినీబండి

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్టలో వెలసిన ఎల్లమ్మ జాతర వైభవంగా జరిగింది. జాతరలో భాగంగా రెండు రోజులుగా అమ్మవారి ఆలయంలో వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం రాత్రి నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి ఆమ్మ వారికి మొక్కులు చెల్లించారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి మహిళా భక్తులు బోనాలు ఊరేగింపుగా తీసుకువచ్చారు. అమ్మవారికి బోనాలు, చీరలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే మండలం నుంచే గాక వివిధ ప్రాంతాల నుంచి భక్తులు చాందినీబండ్లు కట్టారు. చాందినీ బండ్లు ముందు బళ్లారి డ్రమ్స్, చెక్కభజనలు, కోలాటాలు, పిల్లనగ్రోవి తదితర కళారూపాలు ఆకట్టుకున్నాయి. సోమవారం ఉదయం చాందినీబండ్లు అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. జాతరలో భాగంగా అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు ఎల్లమ్మ అమ్మవారిని దర్శించి తరించారు. ఆలయం ముందు పెద్ద ఎత్తున కొబ్బరి కాయలు కొట్టి సంవృద్ధిగా వర్షాలు కురవాలని, పాడిపంటలు అభివృద్ధి చెందేలా ప్రజలను చల్లగా చూడాలని వేడుకొన్నారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది.

వంట మాస్టర్లకు ఒక రోజు శిక్షణ

రాయచోటి టౌన్ : వివిధ ప్రభుత్వ పాఠశాలలో వంట మాస్టర్లు, సహాయకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం అన్నమయ్య జిల్లా కేంద్రంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో రాయచోటి డివిజన్ స్థాయిలో ఉన్న అన్ని పాఠశాలలకు చెందిన వర్కర్లు, సహాయకులకు పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన నిర్వహణ, వండే విధానాలపై శిక్షణ ఏర్పాటు చేసినట్లు డీఈఓ శివప్రకాష్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులకు మంచి నాణ్యతతో కూడిన భోజనంతోపాటు రుచికరంగా అందించాలని సూచించారు. మొత్తం 138 మంది వంట మాస్టర్లు, వారి సహాయకులు పాల్గొన్నారు. అనంతరం వంట మాస్టర్లకు వంట పోటీలు నిర్వహించి రుచికరంగా వండిన వారికి బహుమతులు అందించారు. రాష్ట్ర కో–ఆర్డినేటర్ రవీంద్ర నాయక్, ఎంఈఓ వెంకట శివారెడ్డి, స్టేట్ రీసోర్స్ పర్సన్ ఏ.నాగ లక్ష్మమ్మ, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

గంగమ్మ జాతరకు సర్వం సిద్ధం

- కోర్కెలు తీర్చే కల్పవల్లిగా కోర్టులో గంగమ్మ ప్రసిద్ధి
- నేడు అమ్మవారి విగ్రహ ప్రతిష్ట
- 28న రాత్రి తిరునాల, 29న పగలు జాతర



ప్రత్యేక అలంకరణలో కోర్టులో గంగమ్మ

మదనపల్లె సిటీ: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా కోర్టులో గంగమ్మ ప్రసిద్ధి కెక్కింది. మదనపల్లె పట్టణం కోర్టు ఆవరణంలో వెలసిన గంగమ్మ జాతర మంగళవారం రాత్రి, బుధవారం పగలు జాతర ఘనంగా నిర్వహించనున్నారు. మంగళవారం రాత్రి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట ఏర్పాటు చేసి భక్తులకు దర్శనం కల్పించనున్నారు. నిత్యం భక్త పూజలు అందుకునే గంగమ్మకు ప్రతి సంవత్సరం వైభవంగా జాతర నిర్వహిస్తారు. సుమారు వందేళ్ల క్రితం గంగమ్మ ఆలయం ఇక్కడ వెలసింది. మదనపల్లె పరిసర ప్రాంతాల ప్రజలకు ఏదైనా శుభకార్యాలు తలపెట్టిన సమయంలో కోర్టులో గంగమ్మను దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. అనారోగ్యంతో బాధపడుతున్న, భూతప్రేత భయంతో భయపడే వారు ఇక్కడ పూజలు చేస్తే బాధలు తగ్గి సంతోషంగా ఉంటారని ఈ ప్రాంతవాసులు విశ్వాసం. ప్రతి మంగళ, శుక్రవారాల్లో రాహుకాలంలో నిమ్మకాయ మీద నేతి దీపాలు వెలిగిస్తారు. తద్వారా సర్వ అరిష్టాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం.

ప్రత్యేక అలంకరణ

జాతర పురస్కరించుకుని ఆలయం వద్ద, బెంగుళూరు రోడ్డు, హెడ్‌పోస్టాఫీసు, హాస్పిటల్ రోడ్డు, కదిరిరోడ్డు, ఎన్టీఆర్ సర్కిల్, సొసైటీకాలనీ అమినేనివీధి, కజిన్స్ రోడ్డు, రాటకొండవీధి ప్రాంతాల్లో రంగు విద్యుత్‌దీపాలతో అలంకరించారు. అమ్మవారు, వివిధ దేవతామూర్తుల కటౌట్లు విద్యుత్ అలంకరణతో ఏర్పాటు చేశారు. జాతర పురస్కరించుకుని ఆలయం వద్ద భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అలాగే అన్ని ఏర్పాట్లు చేశారు.

ఆలయంలో పూజలు

జాతర సందర్భంగా ఆలయంలో సోమవారం కమిటీ చైర్మన్ చిన్నరెడ్డప్ప, ఉపాధ్యక్షులు వేణుగోపాల్, గౌరవ అధ్యక్షులు భవానీప్రసాద్, కోశాధికారి రంగస్వామి, కరుణాకర్‌లు పూజలు చేశారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు.

పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు



కాలువలు శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

పీలేరు రూరల్ : పీలేరు పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ జీనత్‌షఫీ తెలిపారు. సోమవారం స్థానిక సదు మార్గంలో మురుగునీటి కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలతో పట్టణంలోని పలు మురుగునీటి కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయినట్లు తెలిపారు. స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదులతో విస్తృతంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈవో గఫూర్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై స్పందించాలి

ఎంపీడీఓ కృష్ణమూర్తి



మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమూర్తి

తంబళ్లపల్లె: మండలంలో ప్రజా సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి కోరారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నియమావళికి లోబడి సమావేశం నిర్వహించారు. గ్రామీణ తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వైద్యం, వ్యవసాయం, విద్య అంశాలపై సమీక్ష జరిగింది. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మాట్లాడుతూ మండలంలో ఎక్కడైన తాగు నీటి సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. కోసువారిపల్లె పీహెచ్‌సీ వైద్యులు మునికుమార్ మాట్లాడుతూ క్షయవ్యాధి నివారణకు మండలంలోని అన్ని హెల్త్‌క్లినిక్‌ల పరిధిలో బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్నామని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని, 18 ఏళ్లపైబడిన వారు వ్యాక్సిన్ వేసుకోవాలన్నారు. సింగిల్‌విండో చైర్మన్ భార్గవ రెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ కరీమ్, కోఆప్షన్ సభ్యులు జమాల్ బాషా, సర్పంచుల సంఘం అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయంపై ధీమా



ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని సన్మానిస్తున్న కలికిరి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు

కలికిరి: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించి పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హ్యాట్రిక్ సాధించడం ఖాయమని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం మండలంలోని పలువురు నాయకులు వరుసగా పీలేరు ఎమ్మెల్యే చింతలను కలిసి దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమాలలో మైనార్టీ జేఏసీ వ్యవస్థాపకుడు ఎంఐ హనీఫ్, మండల ప్రత్యేక ఆహ్వానితుడు శివాజీ, నాయకులు మల్లికార్జున, మహమ్మద్ రఫీ, రామక్రిష్ణ, సహదేవ తదితరులు పాల్గొన్నారు.

బాధితులు ఫిర్యాదు చేస్తే కేసులు



డీఎస్పీ ప్రసాదరెడ్డి

మదనపల్లె : పట్టణంలో భూదందాలు, సెటిల్మెంట్లకు పాల్పడిన వ్యక్తులు, లేదా ప్రజాసంఘాలపై బాధితులు ఫిర్యాదుచేస్తే తప్పక చర్యలు తీసుకుని, వాస్తవమని తేలితే కేసులు నమోదుచేస్తామని డీఎస్పీ ప్రసాదరెడ్డి తెలిపారు. సోమవారం సాక్షిలో మదనపల్లెలో ప్రజాసంఘాల భూదందా శీర్షికన వచ్చిన వార్తపై ఆయన స్పందించారు. పట్టణ శివారు ప్రాంతాల్లో కొంతమంది పేదప్రజలను భూదందాల పేరుతో వేధింపులకు గురిచేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వీటికి సంబంధించి బాధితులు ఎవరైనా ఉంటే నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయవచ్చన్నారు. అలాగే ప్రజాసంఘాల మాటున భూదందాలు, రౌడీయిజం చేసే వ్యక్తులు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, బాధితులు ఫిర్యాదుచేస్తే రౌడీషీట్‌లు ఓపెన్‌చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. త్వరలోనే పట్టణంలోని రౌడీషీటర్లు, ప్రజాసంఘాల నాయకులు, సభ్యులందరితో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి కౌన్సిలింగ్ చేస్తామన్నారు.

సేవాభావం అలవర్చుకోవాలి



దుస్తులు పంపిణీ చేస్తున్న వడ్లమూడి మాధవి

పీలేరు : ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలని వీఎస్ఎన్ సిద్ధార్థ విద్యాసంస్థల కరస్పాండెంట్ వడ్లమూడి మాధవి అన్నారు. సోమవారం వీఎస్ఎన్ విద్యాసంస్థల వ్యవస్థాపకులు వడ్లమూడి శ్రీనివాసులునాయుడు వర్ధంతిని పురస్కరించుకుని కలికిరి సమీపంలో సరోవదయ వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. అలాగే అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమకున్నంతలో ఎంతోకొంత పేదలకు సాయం చేయాలని కోరారు. ఇతరుల సంతోషాన్ని మనం ఎప్పుడు కోరుకుంటామో, మన మరింత సంతోషంగా ఉండగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు పాల్గన్నారు.

